ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 20 ఆగస్టు 2025





పోచమ్మ మైదాన్‌లో కట్టడాలను కూల్చివేస్తున్న జేసీబీలు

గోదావరిఖనిలో ఆపరేషన్ పోచమ్మ మైదాన్

వివాదాస్పద స్థలంలో కట్టడాల కూల్చివేత

- ప్రభుత్వ స్థలమని పేర్కొంటున్న కార్పొరేషన్

కోల్‌సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పోచమ్మ మైదానంలో రామగుండం నగరపాలక సంస్థ మంగళవారం ఆపరేషన్ పోచమ్మ మైదాన్ చేపట్టింది. మంగళవారం సాయంత్రం పోలీస్ బందోబస్తు మధ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఉన్న కట్టడాలను యంత్రాలతో నగరపాలక సంస్థ కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్నట్టు నగరపాలక సంస్థ అధికారులు పేర్కొన్నారు. జనగామ శివారు సర్వే నంబర్ 683, 693, 694 సంబంధించి హద్దుల విషయంలో సోమవారం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) సర్వే చేసింది. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను తొలగించారు. గతంలో షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మూడు షటర్లను కార్పొరేషన్ కూల్చివేయగా, ఇప్పుడు అదే స్థలంలోని మిగతా షటర్లను కార్పొరేషన్ తొలగించింది. కార్పొరేషన్ ఈఈ రామన్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నవీన్, టీపీబీఓలు కూల్చివేతలను పర్యవేక్షించారు. కూల్చివేసిన నిర్మాణాల్లో ఉంటున్న వ్యాపారులు తమ దుకాణాలను ఖాళీ చేశారు. మరి కొందరు వ్యాపారులు కోర్టు పరిధిలో ఉన్న తమ దుకాణాలను ఎందుకు కూల్చివేస్తున్నారంటూ కార్పొరేషన్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సుమారు 10 ఎక్స్‌కావేటర్లు, పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలను చేపట్టారు.

- 20 ఏళ్ళ తర్వాత తిరిగి కార్పొరేషన్ చేతికి

రామగుండం మున్సిపాలిటీ చేతుల్లో నుంచి ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిన పోచమ్మ మైదాన్ స్థలం ఇరవై ఏళ్ళ తర్వాత తిరిగి నగరపాలక సంస్థ చేతికి వచ్చింది. జనగామ శివారు సర్వే నంబర్ 693లో సింగరేణి అవసరాల నిమిత్తం యాజమాన్యం 1968లో పట్టాదారుల నుంచి 8.2 ఎకరాలు భూసేకరణ జరిగింది. అప్పటి నుంచి ఈ స్థలం పూర్తిగా సింగరేణి ఆధీనంలోనే ఉన్నది. సింగరేణిలో పనిచేసే కార్మిక కుటుంబాల అవసరాల నిమిత్తం ఈ స్థలంలోనే కూరగాయాల మార్కెట్, మాంసం దుకాణాలు, ఇతర చిరు వ్యాపార దుకాణాలు, సింగరేణి బ్యారెక్స్ ఉండేది. దుకాణాల నుంచి సింగరేణి అద్దె వసూలు చేసేది. ఈ స్థలంలో ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మున్సిపాలిటీ ప్రతిపాదించింది. సింగరేణిని సంప్రదించగా, సింగరేణి యాజమాన్యం కూడా స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించింది. 2006లో అప్పటి మున్సిపల్ ఛైర్మన్ బడికెల రాజలింగం ఆధ్వర్యంలో కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ కౌన్సిలర్లు ఒకతాటిపై వచ్చి మార్కెట్‌ను 150 షాప్‌లను తొలగించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనువుగా స్థలాన్ని చదును చేసి ఫెన్సింగ్ నిర్మించారు. పాలకవర్గం పదవీ కాలం పూర్తవడంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో జాప్యం జరిగింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 39 గుంట స్థలం తమదేనంటూ పట్టాదారులుగా చెప్పుకుంటున్న వ్యక్తులు రంగప్రవేశం చేశారు. 2014 జూన్ 17న దొడ్డిదారిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రతిపాదిత స్థలంలోనే అప్పటి అధికారులు ప్రైవేట్ వ్యక్తుల ప్రహరీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వగా వెంటనే అందులో భవనాలు వెలిశాయి. అప్పటి ప్రజా ప్రతినిధులు ఈ నిర్మాణాలకు అండగా ఉన్నారనే విమర్శలు వచ్చాయి. అప్పటి నుంచి కోర్టుల్లో వివాదం నడుస్తున్నది. ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ ఎన్నిక అయ్యాక పోచమ్మ మైదాన్‌లో ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. న్యాయస్థానాల్లో సింగరేణి, ప్రభుత్వం వైపు నుంచి కొట్లాడుతున్నారు. కొన్ని రోజుల క్రితం ప్రభుత్వ స్థలా ల్లో నిర్మాణాలను తొలగించారు. మంగళవారం ప్రభుత్వ స్థలంలో మిగిలి ఉన్న నిర్మాణాలను తొలగించారు.

- జనం తాకిడి



జనాలను అదుపు చేస్తున్న సీఐ

40 ఏళ్ళపాటు మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన స్థలం కళ్ళ ముందే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం, అందులో భవనాలు వెలియడం పారిశ్రామిక ప్రాంతంలో పోచమ్మ మైదాన్ స్థల వివాదం చర్చనీయాంశమైంది. మంగళవారం ఆ నిర్మాణాలను నగరపాలక సంస్థ తొలగిస్తున్నదనే సమాచారంతో ప్రజలు పెద్దఎత్తున పోచమ్మ మైదాన్ ప్రాంతానికి వచ్చారు. వారిని అదుపు చేయడం పోలీసులకు గగనంగా మారింది. ఒక సమయంలో రోప్ పార్టీలను పెట్టి జనాలను కూల్చివేతలకు దూరంగా పంపించారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తి చేస్తాం



ఐబీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఐబీ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులు, ఐబీ కాంప్లెక్స్ గదుల నిర్మాణ పనులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులతో కలిసి మంగళవారం సమీక్షించారు. పూర్తయిన గదులను ఆయన పరిశీలించారు. వారికి పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం రోడ్డు విస్తరణ పనుల గురించి మాట్లాడుతు ఐబీ చౌరస్తా నుంచి శాంతినగర్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతాయని, ప్రస్తుతం ఐబీ చౌరస్తా వద్ద ఉన్న షాపింగ్ గదులను తొలగించాల్సి వస్తుందని, వారి ఉపాధికి ఇబ్బంది కలగకుండా వెనక కొత్తగా రూ.65 లక్షలతో గదులను నిర్మిస్తామని, ఇవి పూర్తి కావడంతోనే ముందున్న గదుల కూల్చివేత ప్రారంభించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతామన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు గాజుల రాజమల్లు, దామోదర్ రావు, మాజీ సర్పంచ్ గుర్రం రాజయ్య, సత్యం, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, ఎండీ అమీనొద్దిన్, కుమార్ కిషోర్, రఫీక్, ఫరూక్, కిరణ్, గడ్డం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై విషం చిమ్ముతున్నారు



బ్యారేజీ వద్ద మాట్లాడుతున్న పుట్ట మధు

మంథనిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల కన్నీళ్లు తుడిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ విషం చిమ్ముతున్నదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మంగళవారం సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజీని గోదావరి విలాపం అనే పేరుతో స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఆపితే కట్టిన వాళ్ళకు పేరు వస్తుందనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి కక్షపూరితంగా వ్యవహరిస్తుంటే మంథని ఎమ్మెల్యే ఆయన అడుగులకు మడుగులు ఒత్తుతున్నాడన్నారు. గోదావరి నిండుగా ప్రవహిస్తుందని, నీళ్లు వృథాగా పోతుంటే గోదావరి నది కన్నీళ్లు పెట్టుకుంటుందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని చెప్తున్నారని, కాని సుందిళ్ల బ్యారేజీకి ఎలాంటి ఇబ్బంది లేకున్నా గేట్లు ఎత్తి నీళ్లను ఎందుకు వృథా చేస్తున్నారో జవాబు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరిచి ఇప్పటికైనా వృథాగా పోతున్న గోదావరి నీళ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నీటి నిల్వతో ఈ ప్రాంతంలోని రైతులకు, ప్రజలకు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతుం దన్నారు. నాయకులు ఎగోళపు శంకర్‌గౌడ్, మాచీడి రాజుగౌడ్, దండె ప్రసాదు, కనవేన శ్రీనివాస్, కండె రమేష్, మిర్యాల ప్రసాద్‌రావు, కాయితి సమ్మయ్య, బడికెల నది పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రి ఫేస్ రికగ్నిషన్ సిస్టం యంత్రం చోరీ

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు, సెక్యూరిటీ నీడలో ఉండే గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు హాజరు పడే ఫేస్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) యంత్రం చోరీకి గురైంది. సూపరింటెండెంట్ గదిలో రోజూ ఆసుపత్రి వైద్యులు హాజరు పడి విధులకు వెళుతుంటారు. ఈనెల 17 నుంచి ఈ యంత్రం కనబడడం లేదు. ఆసుపత్రిలో నిత్యం సెక్యూరిటీ గార్డ్‌ల కాపలా సీసీ కెమెరాల నీడలో ఉండే ఆసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ చోరీకి గురి కావడం చర్చనీయాంశంగా మారింది. సూపరింటెండెంట్ గదిలో నుంచే యంత్రం మాయం కావడం పలు అనుమానాలకు దారి తీస్తుంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్



ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

అంతర్గాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువన గల కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి 3.67 లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తుతుండగా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20టీఎంసీలకు గాను 17 టీఎంసీల నీరు ఉంది. ఎల్లంపల్లి 40 గేట్లను ఎత్తి 3.67లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రాజెక్ట్ వద్ద ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితిపై ఎల్లంపల్లి అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు 40గేట్లు ఎత్తి దిగువన గోదావరిలోకి పెద్ద ఎత్తున నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు గోదావరి తీర ప్రాంతంలోకి వెళ్లవద్దని, మత్స్యకారులు, గొర్రెల, మేకల కాపరులు గోదావరి సమీపంలోకి వెళ్లవద్దని సూచించారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో జీలకుంట వాసికి బహుమతి



హైదరాబాద్ లో బహుమతిని అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ఓదెల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) :ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో మండలంలోని జీలకుంటకు చెందిన ఫొటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశంకు బహుమతులు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పోటీలు నిర్వహించగా రాజీవ్ యువ వికాసం కేటగిరితోపాటు, రైతు భరోసా పథకంలో ప్రభుత్వ సమాచారాన్ని చూస్తున్న రైతు ఫొటోలకు ద్వితీయ, కన్సోలేషన్ బహుమతులతో పాటు రూ. 15 వేల నగదు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పోటీలు నిర్వహించగా, వీరేశం తీసిన పలు రకాల ఫొటోల్లో రెండు ఫొటోలు ఎంపిక చేశారు. హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రెస్ అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులు బహుమతులు అందజేశారు.

అధిక యూరియా వాడడం ప్రమాదకరం

పెద్దపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా అధికంగా వాడటం ప్రమాదకరమని, యూరియా నిల్వ ఉంచరాదని, ప్రస్తుత అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. యూరియా బస్తాలను ముందస్తుగా కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకుంటే దానిలో గల నత్రజని ఆవిరై పోతుందని, అలాంటి యూరియా వాడినప్పుడు మొక్కకు నత్రజని సరిగా అందక దిగుబడులు తగ్గిపోతాయన్నారు. 45 కిలోల యూరియా బస్తాలో 20 కిలోల నత్రజని. ఉంటుందని, బస్తాలు ముందస్తుగా నిల్వ చేసుకుంటే 20 కిలోలు నత్రజని ఆవిరైపోతాయన్నారు. యూరియా బస్తాలు ఇండ్లలో నిల్వ చేసుకుంటే ఆవిరైనప్పుడు పుట్టిన ప్రమాదకరమైన విషవాయువు విడుదలవుతుందని, దీనివలన శ్వాసకోశ వ్యాధులు వస్తాయన్నారు. యూరియాను ఒకేసారి పెద్ద మొత్తంలో అంటే ఎకరానికి ఒక బస్తా చొప్పున ఒకేసారి వేస్తే, మొక్క విపరీతంగా ముదురు పచ్చలోకి వచ్చి, చీడ పీడలను ఆకర్షిస్తుందని, పంట కాలం, సాగు ఖర్చు పెరిగిపోతుందని, పూత, కాత పంట తగ్గిపోతుందన్నారు. పొలంలో యూరియా వేసినప్పుడు 15 లేదా 20 కిలోల యూరియాను పొడి ఇసుకలో కలిపి పంటకు సమంగా వేసుకోవాలని, 15 రోజులకు ఒకసారి నాలుగు దఫాలు వేసుకోవాలని, చివరి దశలో యూరియాతోపాటు 20 కిలోల పొటాష్ కలిపి వేసుకుంటే సరిపోతుందన్నారు. యూరియా పంటకు ఎంత మంచి చేస్తుందో అధికంగా వాడితే అంతకంటే ప్రమాదకరమని రైతులు గ్రహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మంజూరై ఆర్థిక స్థోమత లేక నిర్మాణం మొదలు పెట్టని ప్రతీ పేదవాడి ఇంటి నిర్మాణానికి కృషి చేస్తానని ఎస్సి, ఎస్టి, సాంఘిక సంక్షేమ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఎల్1 లిస్టులో 634 ఇండ్లు మంజూరు కాగా కొందరు ఆర్థిక స్థోమత లేక ఇప్పటి వరకు ఇండ్లు మొదలు పెట్టలేదని తెలిపారు. ఆర్థిక స్థోమత లేని వారు అధైర్యపడవద్దని, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారి ఇందిరమ్మ ఇండ్లు డిసెంబర్‌లోగా పూర్తి చేయుటకు ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పనులు మొదలు పెట్టించారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మహిళా గ్రూపుల ద్వారా సోలార్ ప్రాజెక్ట్ పనులు మొదలు పెడుతామని చెప్పారు. అనంతరం 23 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను, 121 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఎంపీఓ కె.రవేష్, ఆర్ఐ వరలక్ష్మి ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్, వైస్ చెర్మెన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖనిలో తీజ్ సంబరాలు



కళ్యాణ్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో బొందిలి కులస్తుల తీజ్‌మాత వేడుక మంగళవారం నిర్వహించారు. రాఖీ పౌర్ణమి రోజున వెదురు బుట్టలో నవధాన్యాలు వేసి తొమ్మిది రోజులు పూజించిన తరువాత చివరిరోజు ఆలయంలో దేవుడికి సమర్పించి మొక్కులు చెల్లించారు. బైసా జయసింగ్ లక్ష్మీబాయి, ప్రతాప్‌సింగ్, లక్ష్మణ్‌సింగ్, బట్టి కిషన్‌సింగ్, జ్యోతిబాయ్, గంగాబాయ్, భగవత్‌సింగ్, పవన్‌సింగ్, శ్యాంసింగ్, జలప్రదీప్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను సవరించాలి

పెద్దపల్లి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను అలైన్‌మెంట్ చేసుకోవాలని, లేనట్లయితే వాటిని తొలగించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హన్మకొండలోగల విద్యుత్ భవన్‌నుంచి 16సర్కిళ్ల ఎస్ఈలు, డీఈ ఆపరేషన్, డీఈ టెక్నికల్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. గతేడాది నుంచి పోల్‌లపైన ఉన్న కేబుల్ వైర్లు తొలగించాలని, కేబుల్ ఆపరేటర్లకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని, దీంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందుకు అనుగుణంగా కేబుల్ వైర్లు అలైన్‌మెంట్ చేసుకోవాలని లేనట్లయితే తొలగించాలని ఎస్ఈలను ఆదేశించారు. అడ్డదిడ్డంగా కేబుల్‌వైర్లు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఒకపద్ధతి ప్రకారం కేబుల్‌వైర్లు అమర్చుకోవాలని సూచించారు. వినాయకవిగ్రహాల తరలింపులో ప్రమాదకరంగా ఉన్న లైన్లక్లియరెన్స్ చేపట్టాలన్నారు. విగ్రహాల తరలింపు సమయంలో లైన్లకు తగలకుండా సరఫరా డిస్‌కనెక్షన్ చేయాలన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కూడా జాగత్త వహించాలన్నారు. వినాయక నిమజ్జన రూట్‌లన్నీ తనిఖీ చేపట్టాలని అన్నారు. రూట్ క్లియరెన్స్ ఉండేలా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశించారు.

సంచితో పాటు సన్న బియ్యం

- వచ్చే నెలలో బియ్యంతో కలిపి పంపిణీ
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఫొటోలు
- ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం
- కొత్త రేషన్ కార్డుల వినియోగదారులకు బియ్యం
- వచ్చే నెలకు 4403 టన్నుల బియ్యం కోటా కేటాయింపు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రేషన్ షాపుల ద్వారా సరుకులను తీసుక వెళ్లేందుకు ప్రభుత్వం వచ్చే నెల నుంచి పర్యావరణహితమైన సం చులను సరఫరా చేయనున్నది. ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు, పాత కార్డుల్లో చేర్పులు, మార్పుల్లో భాగంగా అదనంగా చేర్చిన కుటుంబ సభ్యులకు కూడా వచ్చే నెల నుంచి బియ్యం అందించనున్నారు. ఈ మేరకు సెప్టెంబర్ మాసానికి గాను ప్రభుత్వం జిల్లాలో గల రేషన్ వినియోగదా రులకు 4,403 టన్నుల సన్న బియ్యాన్ని కేటాయించింది.

రాష్ట్రంలో ఇస్తున్న సన్నబియ్యం గురించి, ప్రభుత్వం హామీ ఇచ్చిన అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు రేషన్ కార్డులు కలిగిన వినియోగదారులకు సంచులను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ సంచులను 15 కిలోల వరకు సరుకులు పట్టే విధంగా తయారు చేశారు. ఈ సంచులపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు, ఇందిరాగాంధీ ఫొటోతో గల అభయహస్తం పేరిట ఆరు గ్యారంటీ పథకాలు మహాలక్ష్మి, గృహలక్ష్మి, యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా పేరిట గల లోగోను ముద్రించారు. అలాగే 'అందరికి సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అనే నినాదం ప్రగతి పథం... సకలజన హితం... మన ప్రజా ప్రభుత్వం అనే ట్యాగ్ లైన్‌తో సంచులను ముద్రించారు. రేషన్ షాపులకు వచ్చి పీఓఎస్ మిషన్లపై వేలి ముద్రలు వేసిన తర్వాత బియ్యంతో పాటు సంచులను కూడా అందజేయను న్నారు. ఈ సంచుల్లో ఇద్దరు కుటుంబ సభ్యులు ఉన్న వాళ్లు మాత్రమే బియ్యం తీసుకపోవచ్చు. అనంతరం మార్కెట్‌కు సంచులను తీసుకువెళితే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నదనే ప్రచారం అవుతుందనే ఉద్దేశ్యం తోనే సంచులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తు న్నది. సంచులు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుకుంటున్నాయి.

- కొత్త రేషన్ కార్డుదారులకు ఈ నెల నుంచే

రెండు, మూడు నెలల నుంచి కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారితోపాటు పాత కార్డుల్లో చేర్పులు,

(మిగతా 8వ పేజీలో)

చెరువులకు జలకళ



మత్తడి పారుతున్న మారేడుగొండ చెరువు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయి. అప్పన్నపేట, బొంపల్లి, రాగినేడు, బ్రాహ్మణపల్లి గ్రామాలతోపాటు పలు గ్రామాల్లోని చెరువులు మత్తడి పారుతున్నాయి. రాగినేడు పెద్దచెరువులో చేపలు బయటికి వెళ్లకుండా వాటికి రక్షణగా ఉన్నారు. బొంపల్లిలో వరదనీరు పంట పొలాల్లో చేరాయి. పలు గ్రామాల్లోని పత్తి పంటల్లో పూర్తిగా వరదనీరు చేరాయి. పలు వార్డుల్లో వర్షపు నీరు చేరడంతో అధికారులు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టారు.



మత్తడి పారుతున్న రాగినేడు చెరువు

భార్యపై క్రికెట్ బ్యాట్‌తో దాడి

చందుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యపై భర్త క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం రామరావుపల్లె గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సంపత్ అనేవ్యక్తి కుటుంబ కలహాలతో భార్య లహరిపై క్రికెట్ బ్యాటుతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై చందుర్తి ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి గ్రామశివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్లగొండ గ్రామంలో..

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను నల్లగొండ గ్రామంలో మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ట్రాక్టర్‌ను ఎల్ఎండీ పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. కొత్తపల్లికి చెందిన చిట్యాల నరేష్‌తో పాటు కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుర్ర లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంథనిలో చోరీ

మంథని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రావుల చెరువుకట్టలో రాంపెల్లి ఆనంద్ ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానికులు సోమవారం రాత్రి గుర్తించారు. ఆనంద్ కొద్ది రోజులుగా వరంగల్ ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూం, బీరువాలో సామగ్రి చిందవందర చేశారు. ఇంట్లో ఏమేమి చోరీ జరిగిందో తెలియలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించారు.

దుకాణంలో చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కాన్పూర ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి ఒక శానిటరీ షాపులో దొంగతనం జరిగింది. ఎండీ షకీల్ కాన్పురలోని పెద్దపల్లి రోడ్‌లో షకీల్ శానిటరీ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాపు తాళంవేసి ఎప్పటి మాదిరిగానే ఇంటికి వెళ్లాడు. మంగళవారం షకీల్ దుకాణం తెరిందుకు రాగా షటర్ తాళం పగులగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లిచూడగా కౌంటర్‌లో డబ్బులు కనపడలేదు. కౌంటర్‌లో ఉన్న దాదాపు 20 వేల రూపాయలు గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారని బాధితుడు షకీల్ కరీంనగర్ మూడో టాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పని బంగారం బతుకు నిస్సారం



- పెరుగుతున్న ధరలతో తగ్గిన పని
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కార్పొరేట్ జ్యూవెల్లరీలు
- చితికిపోతున్న స్వర్ణకారుల జీవితాలు
- బతుకుదెరువు కోసం ఇతర రంగాల బాట

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కులవృత్తులు రోజురోజుకూ ఉనికిని కోల్పోతున్నాయి. చేసేది లేక కొందరు బతుకు దారి మార్చుకుంటున్నారు. మరి కొందరు ఇప్పటికీ తాతల కాలం నుంచి వారసత్వంగా స్వీకరించి స్వర్ణకార వృత్తినే నమ్ముకుని అవస్థలు పడుతున్నారు. పని బంగారం.. కానీ బతుకు నిస్సా రంగా మారిందని స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లో శుభకార్యం తలపెడితే ముందుగా గుర్తుకు వచ్చేది బంగారం దుకాణమే. వివాహవేడుకలకు బంగారానికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. మహిళలు అందంగా, హుందాగా కనిపించాలని బంగారు ఆభరణాలు ధరిస్తారు. బంగారు ఆభరణాలు తయారు చేయాలంటే దాని వెనుక పెద్ద కష్టమే ఉంటుంది.

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 10 నుంచి 20 వేలకు పైగా స్వర్ణకార కుటుంబాలు ఉన్నాయి. బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయడం లేదు. దీంతో స్వర్ణకారులు పని దొరకక దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేక పోతున్నారు. కుటుంబ పోషణ భారమై ఇతర రంగాల్లో పని చేస్తున్నారు. మరో వైపు ఆభరణాల రంగంలో కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపులు పెద్ద ఎత్తున వెలవడంతో పాటు వాయిదాల పద్ధతిలో బంగారు ఆభరణాలు విక్రయిస్తుండడంతో వినియోగదారులు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో కొనుగోలు చేసేందుకే మొగ్గు చూపుతు న్నారు. కార్పొరేట్ వ్యవస్థ కారణంగా స్వర్ణకారులు వృత్తి పనులు కోల్పోతున్నారు.

కూలీలుగా మారుతున్న స్వర్ణకారులు

పెరుగుతున్న బంగారం, వెండి ధరల కారణంగా, సర్వం యంత్రాలమయం కావడంతో స్వర్ణకారులకు చేతినిండా పని లేకుండా పోయింది. దీంతో కొందరు పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక బ్యాంకుల్లో అప్రయిజర్లుగా చేరిపోయారు. బతుకు బండిని లాగేందుకు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంతమంది భవన నిర్మాణ కార్మిక రంగంలో కూలీలుగా మారి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంకొంత మంది ఇడ్లీ, టీ బండ్లను నడుపుకుంటున్నారు. ఇక ఇతర వృత్తుల్లోకి వెళ్లడం ఇష్టంలేని మరికొంత మంది స్వర్ణకారులు రాగి, ఇత్తడి, పంచలోహ తాయిత్తులు, ఇతర చిన్న చిన్న వస్తువులను తయారు చేస్తూ వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం స్వర్ణకార వృత్తి చేస్తున్న వారెవరూ కూడా వారి పిల్లలకు ఈ వృత్తిని నేర్పించడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వం ఇతర చేతి వృత్తుల వారికి ఇచ్చిన మాదిరిగా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలి



కట్ట జగన్, జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి

ధరల హెచ్చుతగ్గులు, కార్పొరేట్ జ్యూవెల్లరీ దుకాణాలతో వృత్తిని నమ్ముకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారికి కొంతమేరకు వ్యాపారాలు నడుస్తున్నాయి. ఆర్థికంగా లేని స్వర్ణకారులు కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల్లో గుమస్తాలుగా చేరుతున్నారు. మరికొంత మంది వెల్డింగ్ షాపుల్లో, భవన నిర్మాణ రంగంలో కూలీలుగా మారారు. ప్రభుత్వాలు స్పందించి వడ్డీ లేకుండా రూ.10లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలి.

చేతినిండా పనిలేకుండా పోయింది



శ్రీరామోజు రవీంద్రాచారి, స్వర్ణకారుడు

పండుగలతో పాటు వివాహాది శుభ ముహూర్తాలు ఉంటే చేతి నిండా పని ఉండేది. మార్కెట్లోకి కార్పొరేట్ జ్యువెలర్స్ రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కనీసం చిన్న చిన్న పనులు కూడా రావడం లేదు. ప్రభుత్వం గుర్తించి నిరుపేద స్వర్ణకారులను ఆదుకోవాలి. ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయి.

ఇతర పనులు చేస్తున్నాం..



కనపర్తి సత్యనారాయణ, స్వర్ణకారుడు

బంగారం ధరలు విపరీతంగా పెరగడం, మార్కెట్లో కార్పొరేట్ జ్యూవెలరీ షాపులు విరివిగా వెలుస్తుండ డంతో బంగారం, వెండి పనిచేసేవారికి చేతి నిండా పనిలేకుండా పోయింది. కొన్ని దుకాణాల్లో వాయిదాల పద్ధతిన ఆభరణాలు విక్రయిస్తున్నందున వినియోగ దారులు అటువైపే వెళ్తున్నా రు. పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేయలేక, ఇతర రంగంలో పనులు చేయడం ఇష్టంలేక, పంచలోహ ఉంగరాలు చేస్తూ కుటుంబాలు వెళ్లదీసుకుంటున్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

- ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ట్రాలీ సీజ్
- రూ.4 లక్షల జరిమానా

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ హెచ్చరించారు. వీర్నపల్లి మండల కేంద్రం పరిధిలోని ప్రధాన రహదారిపై మంగళవారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాలను ఆపి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సామర్థ్యానికి మించి ప్రయాణీకులను తరలిస్తున్న ఆటోవాలలపై కొరఢా ఝుళిపించారు. వాహన పన్ను చెల్లింపునకు నెల రోజులు గడువు ఇచ్చినా డబ్బులు కట్టని వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపకూడదని పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ప్రయాణీస్తున్న సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ట్రాలీని సీజ్‌చేసి రూ.4లక్షల జరిమానా విధించామని ఇన్‌చార్జి డీటీవో వంశీధర్ పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీటీవో వంశీధర్

సహకార బ్యాంక్‌లో మోగిన సైరన్

- అప్రమత్తమైన పోలీసులు

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో పోలీస్ స్టేషన్ వెనుక సహకారబ్యాంక్ ఉంది. మంగళవారం తెల్లవారుఝామున ఒక్కసారిగా బ్యాంక్ నుంచి హారన్ వినిపించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. సైరన్ అలా ఆగకుండా మోగుతూనే ఉండడం, బ్యాంకు షట్టర్లు తెరిచి ఉండడంతో అయోమయానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. బ్యాంకు మేనేజర్ శశికాంత్‌ను వివరణ అడుగగా తెల్లవారుఝామున బ్యాంకును శుభ్రం చేసేందుకు వచ్చిన వ్యక్తి ఆటోమోటిక్ ఆలారం సైరన్ సిస్టమ్‌ను అన్‌లాక్ చేయక షట్టర్లు తీసి లోపలకు రావడంతో ఆటోమేటిక్ సైరన్ మోగిందన్నారు. కొంత సేపటి తర్వాత ఫోన్ ద్వారా సైరన్‌ను అన్‌లాక్ చేయడంతో హారన్ ఆగిపోయిందన్నారు.

వినాయకుడి విగ్రహాన్ని తీసుకువస్తుండగా విషాదం..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణపతి విగ్రహాన్ని తీసుకు వస్తుండగా విద్యుదాఘాతంతో కొమ్ము లక్ష్మీనారాయణ (19) అనేయువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక యువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వీఐపీయూత్ ఆధ్వర్యంలో 12మంది యువకులు గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చేందుకు ఆదివారం నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌కు వెళ్లారు. పెర్కిట్ నుంచి 20అడుగుల గణేష్ విగ్రహాన్ని వాహనంపై తీసుకువస్తుండగా మంగళవారం ఉదయం కామారెడ్డి జిల్లాలోని ఆరెపల్లి శివారులో 11కేవీ విద్యుత్‌వైరు తగిలి లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము నవీన-మైసయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒకకూతురు ఉన్నారు. వీరు ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. పెద్దకొడుకు లక్ష్మీనారాయణ మృతితో కుటుంబంలో విషాదం అలుముకుంది. మరోయువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు లక్ష్మీనారాయణకు సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్క లేదు. లక్ష్మీనారాయణ సాయంత్రం పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటామని స్నేహితులకు చెప్పుకుంటూ ఇంటికి వస్తుండగా విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రగాయాలైన సాయికి స్థానికులు సీపీఆర్ చేసి కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మిగతా 10మంది యువకులు వాహనంపై ముందు ఉండటంతో భారీప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆసుపత్రికి తరలివెళ్లారు.



లక్ష్మీనారాయణ(ఫైల్)

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఓదెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపులలో మంగళ వారం ఊరగొండ లక్ష్మణ్(42) అనేవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. లక్ష్మణ్ భార్య విడాకులు తీసుకొని పుట్టింటికి వెళ్లడంతో అతడు అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్రగాయాలై చికిత్సపొందాడు. ఆరోగ్యం కుదుటపడడంతో పొత్కపల్లిలోని పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిస కావడంతో తల్లి మందలించింది. దీంతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఊరగొండ మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు.



లక్ష్మణ్(ఫైల్)

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తుతెలియని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ కూరగాయల మార్కెట్, వెంకటేశ్వర టెంపుల్ సమీపంలో మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి(50) పడుకొని వర్షంలో తడుస్తూ వణుకుతూ స్థానికులకు కనిపించాడు. ఉదయం 9:30గంటలకు డయల్ 100ద్వారా సమాచారం తెలుసుకున్న కరీంనగర్ ఒకటోటాణా పోలీసులు సదరు వ్యక్తిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడచికిత్సపొందుతూ ఉదయం 10:30గంటలకు మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నల్లనిగీతలు కలిగిన టీషర్టు, నలుపు రంగు పాయింటు ధరించిఉన్నాడని మృతదేహాన్ని ప్రభుత్వఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించినా, ఆచూకీ తెలిసిన వారు వెంటనే కరీంనగర్ ఒకటో టాణాలో సంప్రదించాలని కోరారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఒడ్డెపల్లి క్రాసింగ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మందమర్రి మండలం క్యాతన్‌పల్లికి చెందిన వృద్ధురాలు జడ బక్కవ్వ(80) మృతి చెందిందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. బక్కవ్వతోపాటు ఆమె మనమరాలు మౌనిక మంగళవారం కరీంనగర్‌కు వచ్చి ఒక ఆటోలో బావుపేటకు వెలుతున్నారు. ఈ క్రమంలో ఒడ్డెపల్లి క్రాసింగ్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న బక్కవ్వతోపాటు మౌనిక, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడినవారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బక్కవ్వ మార్గమధ్యలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

ఈత, తాటి చెట్ల ధ్వంసంపై ఎక్సైజ్ అధికారుల పరిశీలన

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని మానేరు వాగు సమీపంలో ఉన్న తాటి, ఈత వనాన్ని కొందరు ధ్వంసం చేశారంటూ గౌడసంఘం నేతల ఫిర్యాదు మేరకు మంగళవారం సుల్తానాబాద్ ఎక్సైజ్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గీత కార్మికులు మాట్లాడుతూ భూమి యజమానులు కొందరు భూములను చదును చేసే క్రమంలో తమకు ఉపాధినిచ్చే తాటి, ఈత చెట్లను కూడా ధ్వంసం చేశారని అధికారులకు వివరించారు. పూర్తి వివరాలు నమోదు చేసుకున్న ఎక్సైజ్ అధికారులు విచారణ చేపట్టారు.

జగిత్యాలలో విషాదం

- మహారాష్ట్ర వరదలో గల్లంతైన ఇద్దరు మహిళల మృతదేహాలు లభ్యం



హసీనా(ఫైల్)



సమీనా(ఫైల్)

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో వరదఉధృతికి కొట్టుకుపోయిన ఇద్దరు మహిళల మృతదేహాలు మంగళవారం లభ్యమవడంతో వారి స్వస్థలమైన జగిత్యాల జిల్లా కేంద్రంలో విషాదం నెలకొంది. నాందేడ్ జిల్లా దెగ్లూర్ సమీపంలోని రావి గ్రామంవద్ద వరదఉధృతికి ఆదివారం జగిత్యాలకు చెందిన ముగ్గురు మహిళలు గల్లంతు కాగా వారిలో మంగళవారం హసీనా(36), సమీనా(50) అనే మహిళల మృతదేహాలు లభ్యమయ్యాయి. జిల్లాకేంద్రంలోని తారకరామనగర్ కాలనీకి చెందిన ముగ్గురు మహిళలు వారి బంధువైన షోయబ్‌తోకలిసి మహారాష్ట్రలోని ఉద్గీర్‌లో ఓ శుభకార్యానికి వెళ్లారు. అనంతరం తిరుగుప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు వరదల్లో గల్లంతు కాగా స్థానికులతోపాటు బాధిత కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం వరద ఉధృతి తగ్గడంతో రావి గ్రామంవద్ద గల్లంతైన కారు 24కిలోమీటర్ల దూరంలోని ముక్రంబాద్ అనే గ్రామం సమీపంలోని బ్రిడ్జికింద పంటపొలాల్లోని బురదలో చిక్కుకున్నట్లు గుర్తించారు. మరికొంత దూరంలో చెట్లపొదల మధ్య హసీనా, సమీనాల మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో మహిళ ఆఫ్రీన్‌కు చెందిన చీరతో పాటు బురఖా కారు వద్ద లభ్యమయ్యాయి.

త్రుటిలో తప్పించుకున్నా..

- ప్రమాదం నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షి షోయబ్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరదలో కారుతోసహా కొట్టుకుపోగా ఆటోడ్రైవర్, కారు డ్రైవర్‌తోపాటు తాను త్రుటిలో తప్పించుకున్నానని ప్రమాదంనుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షి షోయబ్ తెలిపాడు. మహారాష్ట్రలో వరదలో కొట్టుకుపోయిన మహిళల మృతదేహాల కోసం వెతుకుతున్న తారకరామనగర్ వాసులతో ఉన్న షోయబ్‌ను ఫోన్‌లో పలకరించగా ఆదివారం రాత్రి జరిగిన సంఘటనను వివరించాడు. ఆదివారం అర్ధరాత్రి తనబంధువులైన హసీనా, ఆఫ్రిన్, సమీనాలతో కలిసి ఆటోలో ఉద్గిర్ నుంచి బయలుదేరామని తెలిపాడు. ఉద్గీర్‌నుంచి ఆటోలో కొంతదూరం వచ్చాక ముక్తేడ్ తాలూకా దెగ్లూర్‌కు కొంచెందూరంలో మేమువెళ్తున్న రోడ్డుపై నీరు ప్రవహించడం ఆటో డ్రైవర్ గమనించాడన్నాడు. దీంతో వెంటనే డ్రైవర్ ఆటోను వెనక్కుతిప్పే ప్రయత్నం చేశాడని తెలిపాడు. అప్పటికే వెనుకవైపు కూడా నీరుచేరడంతో ఆటో నీటిని దాటివెళ్లలేక పోయిందన్నారు. దీంతో మా ముందున్న కారులో హసీనా,ఆఫ్రీన్,సమీనాతోపాటు ఆటోడ్రైవర్, కారుడ్రైవర్ కూర్చున్నామన్నారు. కొద్దిసేపటికే కారులోకి నీరురావడంతో కాపాడాల్సిందిగా కేకలు వేశామన్నారు. అర్ధరాత్రికావడంతో ఎవరూ ఆ పరిసరాల్లో కనిపించలేదన్నారు. అయితే తాము కొట్టుకుపోవడం ఖాయమని తెలియగానే ఆఫ్రిన్ ఇంటికి ఫోన్‌చేసి తమ పరిస్థితిని వివరించిందన్నారు. అదే సమయంలో కారుతోసహా తాము నీటిలో కొట్టుకు పోయాయని షోయబ్ తెలిపాడు. ఆటోడ్రైవర్, కారు డ్రైవర్‌తోపాటు తానుకొంచెం దూరంలో చెట్టును పట్టుకొని బయటపడ్డామని షోయబ్ పేర్కొన్నారు.



షోయబ్

పోలీసుల అదుపులో అనుమానితులు

గంగాధర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంగాధర పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల16న గంగాధర గ్రామానికి చెందిన పెగుడ మల్లమ్మ(70)ను గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి నంబరులేని కారులో ఎక్కించుకుని వెళ్లారు. మల్లమ్మ ఆచూకీ లభించక పోవడంతో మరుసటి రోజు ఆమె తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు వృద్ధురాలు కారులో ఎక్కిన దృష్యాలను గుర్తించారు. కానీ అగంతకులు వృద్ధురాలిని నంబరు ప్లేటు తొలగించిన కారులో తీసు కెళ్లగా పోలీసులకు నిందితులను పట్టుకో వడం సవాలుగా మారింది. అయితే మంగ ళవారం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఇద్దరు అనుమానితులను అదు పులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమా చారం. కారులో తీసుకెళ్లిన వృద్ధురాలి ఆచూకీ మాత్రం ఇప్పటికీ లభించలేదు. వృద్ధురాలిని తెలిసిన వ్యక్తులే తీసుకెళ్లారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు.

వర్షానికి రహదారిపై నేలకొరిగిన భారీ వృక్షం

జగిత్యాలరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామశివారులోని నిజామాబాద్ రహదారిపై వర్షానికి భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు రోడ్డుకి అడ్డంగా పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తమ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్‌తో వృక్షాన్ని పక్కకు తొలగించారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు.



వృక్షాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఎస్సై సధాకర్

విజిలెన్స్ విచారణపై ఆసక్తి

- మిడ్ మానేరు ప్రాజెక్టులో రూ.224 కోట్ల అక్రమాలపై చర్చ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణ పనులు తొలినాళ్ల నుంచి అనేక అవాంతరాలు, అవినీతి ఆరోపణల మధ్య కొనసాగాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై నిలబడిందనే చర్చలకు మరోసారి ఊతమిస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ నిలిచింది. తాజాగా మిడ్ మానేరు ప్రాజెక్టుపనుల్లో ప్రభుత్వ ఖజానాకు రూ.224కోట్ల మేరకు నష్టం తెచ్చిన అప్పటి ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తన నివేదికను నీటిపారుదల శాఖకు అందజేసినట్లు తెలియడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో చర్చ ప్రజల్లో మొదలైంది.

సీనియర్ ఇంజనీర్ల నుంచి కిందిస్థాయివరకు చర్యలు తీసుకోబోతున్నారా.. విచారణతో కాలయాపన జరుగుతుందా..?, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డలో ఏర్పడ్డ లోపాలతో అప్పటి ప్రభుత్వ పెద్దలకు మిడ్‌మానేరు అవినీతి ఉచ్చు చుట్టుకుంటుందా.. అనే గుబులు మొదలైంది. విజిలెన్స్ అధికారులు పక్కాగా ఆధారాలు సేకరించారు. అందులో అధికారులపైన క్రిమినల్‌చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఒకరిద్దరు అధికారులు ఇప్పటికే రిటైర్ అయ్యారు.. అయినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందని ప్రభుత్వా నికి సిఫారసు చేయడం అధికారుల్లో ఆందోళన మొదలైంది.

2006లో మిడ్ మానేరు ప్రాజెక్టుకు గండి..

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడవద్ద మానేరు వాగుపై మిడ్‌మానేరు పాజెక్టు 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. రూ.399కోట్లతో జడ్వీఎస్, రత్న, సుశీ జాయింట్ వెంచర్‌దక్కించుకంది. నిర్ణీత సమాయాన్ని దాటి గడువు పొడిగించినప్పటికీ.. పనులను పూర్తి చేయలేకపోవడంతో 2012లో మరోకంపెనీలకు నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్న 2015నాటికి అనుకున్నంత స్థాయిలో పనులు కాలేదు. అప్పటికే తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు ఏర్పడడం, ప్రాజెక్టులపై అప్పటి సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్షల తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ముందుకు తెచ్చారు. మిడ్‌మానేరు రిజర్వాయర్‌ను వాటర్ హబ్‌గా కాళేశ్వరం ప్రాజెక్టులో అతికీలకమైనది ఉపయోగపడేలా డిజైన్ చేశారు. ఇక్కడినుంచే లోయర్ మానేరు డ్యాంకు, రంగనాయక సాగర్ , మల్లన్న సాగర్‌కు, కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించే విధంగా ప్యాకేజీలను రూపొందించారు. 2016లో వేగంగా మిడ్‌మానేరు పనులు పూర్తి చేసి కొంత మేరకు నీటిని నిల్వ ఉంచారు. అదే సమయంలో సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు విడమ వైపు కట్టకు గండి పడింది. ఐదు లక్షల క్యూసెక్కులను తట్టుకునేలా నిర్మించిన డ్యాం.. లక్ష క్యూసెక్కులకే కట్టతెగడంతో.. ప్రభుత్వంపై రూ.30 కోట్ల అదనపు భారం పడింది. కుడివైపు స్పిల్‌వే, మట్టికట్ట పని పుణేకు చెందిన యశోదీప్ ఇన్‌ఫ్రాకు అప్పగించారు. ఆ సంస్థ రూ.13 కోట్ల పనులు చేసిన తర్వాత చేతులెత్తేసింది. దీంతో శ్రీరాజరాజేశ్వరి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ.101 కోట్ల పనులను అప్పగించారు. కొత్త కంపెనీలకు పనులను అప్పగించే సమయంలో నిబంధనలను సడలించి.. ధరలను పెంచారు. మరోవైపు కొత్త ధరలను తమకూ వర్తింపజేయాలని జాయింట్ వెంచర్‌లోని మిగతా కంపెనీలు కోరగా.. అందుకు స్టాండింగ్ కమిటీ ఒప్పుకోలేదు. ఇదే సమయంలో ఎడమవైపు మట్టి కట్ట 130 మీటర్ల గండి పడింది. దీంతో అప్పటికే పనులు చేస్తున్న సంస్థను తొలగించి.. ఎడమవైపు పనులకు రూ.347 కోట్లుగా నిర్ధారించి.. పరిపాలన అనుమతులు లేకుండానే టెండర్ పిలిచి.. రాజరాజేశ్వరీ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇచ్చారు. అంచనాలను భారీగా పెంచడంతో ప్రభుత్వానికి రూ 224 కోట్ల నష్టం వాటిల్లింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రాజెక్టు మీద అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. అయినా ఆ ఆరోపణలను బీఆర్ఎస్ పట్టించుకోలేదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డిని, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి మిడ్ మానేరు ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని ముంపు గ్రామాల అధ్యక్షుడు కూస రవీందర్ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. సంవత్సర కాలంగా అధికారులు విచారణ జరిపి.. నివేదిక అందించారు.



మిడ్ మానేర్ ప్రాజెక్ట్




పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు ప్రాజెక్టు

ఎగువ మానేరు పరవళ్లు

అప్రమత్తమైన అధికారులు

గంభీరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెళ్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నర్మాల ఎగువ మానేరు పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. మొత్తం మానేరు నీటి మట్టం 31 ఫీట్లు ఉండగా, మంగళవారం ఉదయంకల్లా 31 ఫీట్లకు చేరి, మత్తడి దూకుడు మొదలైంది. మానేరు మత్తడి దూకి పరవళ్లు తొక్కుతుండటంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. మంగళవారం ఉదయం నుంచి మానేరు మత్తడి దూకుతుండటంతో తహసీల్దార్ మారుతిరెడ్డి సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు మానేరు డ్యాంతో పాటు మానేరు వాగు పరిసరాలను పర్యవేక్షిస్తున్నారు.



శ్రీరాంసాగర్ వద్ద..

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

39 గేట్లు ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

జగిత్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 39 వరద గేట్లు పైకి ఎత్తి 3,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 2,75,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరు ఉంది. వరద కాలువకు 20,000 క్యూ సెక్కులు, కాకతీయ కాలువకు 4,700 క్యూ సెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 82.683 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 22.026 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.



నిండుగా ప్రవహిస్తున్న వరద కాలువ

గాయత్రి పంప్‌హౌస్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ఇంతవరకు మూడు, నాలుగు పంపుల ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలిస్తున్న అధికారులు ప్రస్తుతం ఎస్సారెస్పీ నీరు వస్తున్న నేపథ్యంలో ఒక్క పంపునకు కుదించారు. రెండు పంపుల ద్వారా 3150క్యూసెక్కుల నీరు పంప్ హౌస్ నుంచి వరద కాలువకు తరలి వెళ్తోంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి 15450క్యూసెక్కులు నీరు వరద కాలువలో చేరుతోంది. దీంతో ప్రస్తుతం వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 18 500క్యూసెక్కుల నీరు తరలి వెళుతోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువకు నీటి ప్రవాహం పెరుగుతుండగా రేపటిలోగా ఇక్కడికి నీరు వచ్చే అవకాశం ఉండటంతో పంపులను ఆపివేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలి వెళుతుండటంతో వరద కాలువ నిండు కుండలా తయారైంది.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.08టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని నాలుగో నంబర్ పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న ప్యాకేజీ 11లోని రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ప్రతాపరెడ్డి తెలిపారు.

తెగిన లింగన్నపేట రోడ్డు



వరద ఉధృతికి తెగిన రోడ్డు

గంభీరావుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై ఉన్న రోడ్డు మంగళవారం సాయంత్రం తెగిపోయింది. విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిగా నిండి, మత్తడి దూకుతోంది. దీంతో మానేరు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో లింగన్నపేట రోడ్డు తెగింది. వరద ఉధృతితో మానేరు వాగుపై ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎస్ఐ రమాకాంత్ మానేరు పరివాహక ప్రాంతాల పరిస్థితిని పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు. మానేరు డ్యాం, మానేరు వాగు ప్రాంతాల దగ్గర రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ మార్గాల వైపు వాహనాలు, ప్రజలు వెళ్లకుండా చర్యలను చేపట్టారు.

పంచేంద్రియాలకు శిక్షణ

- కస్తూర్బాల్లో 'బ్రైటర్ మైండ్స్' ట్రైనింగ్‌తో అద్భుత ఫలితాలు
- కళ్లకు గంతలు కట్టుకొని రంగులు, చిత్రాలు గుర్తింపు
- అబ్బురపరుస్తున్న విద్యార్థులు



కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తిస్తున్న విద్యార్థినిని అభినందిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ (ఫైల్)

సారంగాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రైటర్ మైండ్స్ పేరుతో కస్తుర్బా విద్యాలయాల్లో పంచేంద్రియాలకు శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరుస్తున్నారు. జగిత్యాల, సారంగాపూర్‌లోని కస్తూర్బా విద్యాలయాల్లో ప్రత్యేక శిక్షణతో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని తమ ముందున్న రంగులను, అక్షరాలను, చిత్రాలను, వ్యక్తులను తేలికగా గుర్తిస్తున్నారు. ఇటీవల సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శించి కలెక్టర్ సత్యప్రసాద్‌తో శభాష్ అనిపించుకున్నారు. సారంగాపూర్‌లో గత ఏడాది మార్చి నుంచి విద్యార్థులకు శిక్షణను ప్రారంభించారు.

ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో శిక్షణ

హైదరాబాద్‌లోని శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో కన్హాశాంతి వనం ధ్యానం కేంద్ర నిర్వాహకులు జగిత్యాల, సారంగాపూర్ కస్తూర్బా విద్యాలయం నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను బ్రైటర్ మైండ్స్ శిక్షణకు ఎంపిక చేశారు. వీరికి రెండు రోజులు పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. జగిత్యాలకు చెందిన స్వచ్ఛంద సేవకులు మంచాల రామకృష్ణ ఈ శిక్షణకు సంబంధించిన పరికరాలను బహూకరించారు. కస్తూర్బాలో ప్రతి బ్యాచ్‌కు 15 నుంచి 20 మంది విద్యార్థు లు ఈ బ్రైటర్ మైండ్స్ శిక్షణ తీసుకుంటున్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తారు.

మెదడుకు ఉత్తేజం

విద్యార్థులకు మోటివేషన్, ప్రసంగం, రిలాక్సేషన్, ప్రాణయామం, ధ్యానం, మెదడు, కళ్లు, వంటి వాటిపై శిక్షణ ఇస్తూ మరో 40 నిమిషాలు సంగీతాన్ని వినిపిస్తూ పడుకోబెడతారు. లేచిన అనంతరం కళ్లకు గంతలు కట్టుకుని శబ్దం, వాసన, స్పర్శ, దృష్టి ద్వారా రంగులను, వస్తువులను, వ్యక్తులను ఎలా గుర్తు పట్టాలో శిక్షణ ఇస్తారు. బ్రైటర్ మైండ్స్ శిక్షణలో ప్రధానంగా మెదడుకు సంబంధించిన వ్యాయామాలు నేర్పించడం ద్వారా పంచేంద్రియాలు చురుగ్గా పనిచేసేలా తర్ఫీదునిస్తారు. దీంతో పంచేంద్రియాలైన కళ్లు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం ఉత్తేజం చెంది బాగా పనిచేస్తాయి. తద్వారా రంగులను, వాసనను, వ్యక్తులను, చిత్రాలను, అక్షరాలను తేలిగ్గా గుర్తించగల్గుతారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దోహదం

వీణ, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేకాధికారి, సారంగాపూర్



ఈ బ్రైటర్ మైండ్స్ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుంది. శిక్షణతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగింది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను త్వరగా నేర్చు కుంటున్నారు. ఈ శిక్షణ ఎంతగానో విద్యార్థులకు దోహదపడుతుంది.

తొమ్మిది వారాలు శిక్షణ

రజిత, బ్రైటర్ మైండ్స్ శిక్షణ ఉపాధ్యాయురాలు



మెదడుకు సంబంధించిన వ్యాయామం ద్వారానే రంగులను, బొమ్మలను, వ్యక్తులను గుర్తించడం సాధ్యమవుతుంది. మేము హైదరాబాద్‌లో రెండు రోజులు శిక్షణ తీసుకొని మా విద్యార్థులకు బ్యాచ్‌ల వారీగా తొమ్మిది వారాల పాటు శిక్షణ ఇస్తున్నాం. కొంత మంది విద్యార్థులు రెండు వారాల శిక్షణలోనే నేర్చుకోగలుగుతున్నారు.

ఏకాగ్రత పెరిగింది

వైష్ణవి, 9వ తరగతి



బ్రైటర్ మైండ్స్ శిక్షణ తీసుకున్న తర్వాత నాలో ఏకాగ్రత పెరిగింది. అప్పటి నుంచి మెదడు మరింత చురుగ్గా పనిచేస్తోంది. ఈ శిక్షణ భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.



ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగులు తీస్తున్న నీరు

సుందిళ్ల బ్యారేజీలోకి చేరుతున్న నీరు

మంథనిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా, పై నుంచి భారీ వరద నీరు రావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో మంగళవారం గేట్లు ఎత్తి వేయడంతో సుందిళ్ల బ్యారేజీలోకి 2లక్షల 63 వేల 898 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. అయితే బ్యారేజీలో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో నీరు దిగువ ప్రాంతానికి వదిలి వేశారు. దీంతో గోదావరిలో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది. గోదావరి, మానేరు నదుల నుంచి నీరు దిగువ ప్రాంతానికి భారీ ఎత్తున వెళ్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వరద..

శ్రీపాద ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి 3,67,461 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, దిగువకు 40 గేట్ల ద్వారా 4 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతుండగా, అక్కడి నుంచి మిడ్ మానేరుకు 6,300 క్యూసెక్కులను 2 పంపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. వరద ప్రవాహం పెరుగుతుండడంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎల్లంపల్లి బ్యారేజీ వద్దకు వెళ్లి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ బ్యారేజీ మీదుగా మంచిర్యాల జిల్లాకు సాగే రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు నీటి పారుదల శాఖాధికారులు ప్రకటించారు.

ఎత్తిపోతలకు కుదింపు...

బోయినపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఓకే పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎస్సారెస్పీ నిండుకుండలా మారడంతో అక్కడి నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో వరద కాలువ ఎస్సారెస్పీ నీటితో పరుగులు పెడుతోంది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి గాయత్రి పంప్ హౌస్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 17600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రి పంప్ హౌస్ నుంచి 4600 వేలు, ఎస్సారెస్పీ నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 12600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ 3200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు 311.54 మీటర్ల మేరకు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 13.810 టీఎంసీల మేరకు నిల్వ ఉంది.

ఎస్సారార్‌లో త్వరలో స్పాట్ అడ్మిషన్ల షెడ్యూలు

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ ద్వారా భర్తీ చేయడానికి త్వరలో ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా షెడ్యూలు విడుదల చేయనుందని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్, కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం బిజినెస్ ఎనలిస్టిక్స్, బీకాం ఫైనాన్స్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ, బి.సి.ఏ, బీఏలో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయని త్వరలో విడుదలయ్యే దోస్త్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ ప్రకారం ఖాళీలను భర్తీ జరుగుతుందని తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి చివరి అవకాశం అని తెలిపారు.

ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎంఎడ్ (మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్) నాలుగవ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డి. సురేష్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. పరీక్షలు తేదీ 28 ఆగస్టు నుంచి 3 సెప్టెంబరు వరకు జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో, లేదా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నాందేడ్- తిరుపతి ప్రత్యేక రైలు పొడిగింపు

వచ్చే ఏడాది మార్చి 28 వరకు

రెగ్యులర్ చేసి, తిరువణ్ణామలై వరకు పొడిగించాలంటున్న ప్రయాణికులు



పెద్దపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జంక్షన్ మీదుగా నడిచే 07015/16 నాందేడ్ నుంచి తిరుపతికి, అక్కడి నుంచి నాందేడ్‌కు నడుస్తున్న ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను వచ్చే ఏడాది మార్చి 28 వరకు (7 నెలలు) పొడిగించారు. ఇప్పటికే కరీంనగర్ నుంచి తిరుపతికి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఆది, గురువారాల్లో నడుస్తున్నది. దీనికి తోడు ఈ నెలలో నాందేడ్ నుంచి తిరుపతి వరకు దక్షిణ మధ్య రైల్వే వారానికి ఒక రోజు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను నడి పిస్తున్నారు.

ఈ రైలు తిరుపతికి వెళ్లే టప్పుడు పెద్దపల్లి జంక్షన్‌కి ప్రతీ శనివారం రాత్రి 10 గంటలకు వస్తుంది. 07016 తిరుపతి నుంచి నాందేడ్ వైపు వెళ్లేటప్పుడు ప్రతీ సోమవారం పెద్దపల్లి జంక్షన్‌కు ఉదయం 8:35 గంటలకు చేరుకుంటుంది. తిరుపతి, శ్రీకాళహస్తి, విజ యవాడ, బాసర వెళ్లే భక్తులు, ప్రయాణికులు ఈ రైలు ఎంతగానో వినియోగించుకుంటున్నారు. దీనిని ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుగా కాకుండా రెగ్యులర్ రైలుగా మార్చి వారానికి కనీసం మూడు రోజులు నడిపిస్తే ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుంది.

అలాగే ఈ రైలుకు పెద్దపల్లి నుంచి నిజామాబాద్ సెక్షన్ పరిధిలోని కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు వేలాది మంది భక్తులు వెళుతున్నందున తిరువణ్ణామలై రైల్వేస్టేషన్ వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాల టీఎస్‌కేసీ, స్టూడెంట్ ట్రైబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇవ్వడానికి, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి సంయుక్తంగా అవగాహన కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విద్యార్థులకు ఉపయోగకరమైన ఒప్పందాలను టీఎస్‌కేసీ ద్వారా కళాశాల కుదుర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. స్టూడెంట్ ట్రైబ్ ఆర్గనైజేషన్ రిసోర్స్ పర్సన్ స్నేహ రామినేని, కరీంనగర్ టీమ్ మెంబర్స్ రూపాలి, చంద్రకిరణ్, సుమిత్ పాల్గొని విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. దాదాపు 200 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ పి రాజేష్‌ను ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

నేటితో ముగిసిన ముహూర్తాలు

- 24 నుంచి భాద్రపద మాసం
- ఈ సారి సంపూర్ణ చంద్రగ్రహణం
- తిరిగి అక్టోబరు, నవంబరులో శుభకార్యాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు బుధవారంతో ముహూర్తాలు ముగిశాయి. 23వ తేదీతో శ్రావణ మాసం ముగిసి శూన్య మాసంగా చెప్పుకునే భాద్రపద మాసం 24వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ముహూర్తాలు లేకున్నా విఘ్నేశ్వర నవరాత్రులు, పలు వ్రతాలు భాద్రపదంలోనే వస్తాయి. పితృదేవతారాధన లకు అనుకూల మాసం కాగా విష్ణువుకు ప్రీతికర మాసమని శాస్త్రాలు, పురా ణాలు చెబుతున్నాయి. పూజలు, వ్రతాలతో విశేష ఫలితాలు పొంద వచ్చని పండితులు చెబుతున్నారు. సెప్టెంబరులో మహూర్తాల కరువు ఏర్పడగా అక్టోబరు 23 నుంచి నవంబరు 15 వరకు శుభముహూర్తాలు న్నాయి. సెప్టెంబరు 7న సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనుంది.

- **పండుగలివే**

ఆగస్టు 27 వినాయక చవితి, సెప్టెంబర్ 7 చంద్రగ్రహణం, 15 వైష్ణవ కృష్ణాష్టమి, 21 మహాలయ అమావాస్య (పెతరామాస) -బతుకమ్మ వేడుకలు ప్రారంభం, 22 శరన్నవరాత్రులు ప్రారంభం, 29 మూలా నక్షత్రం, 30 దుర్గాష్టమి, అక్టోబరు 1 మహర్నవమి, 2 విజయదశమి, 19 ధనత్రయోదశి, మంగళ హారతులు, 20 దీపావళి-ధనలక్ష్మీ పూజలు

- **శుభ ముహూర్తాల తేదీలు ఇవే...**

అక్టోబరులో 24, 26, 29, 30, 31 తేదీలు. నవంబరులో 1, 7, 8, 13, 15 తేదీలు.

వేములవాడలో రద్దీ..

రాజన్నను దర్శించుకున్న కేసీఆర్ సతీమణి శోభ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

రాజరాజేశ్వర స్వామివారికి ఆర్ద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారికి ఉదయం 5.30 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేపట్టారు. సాయంత్రం 6.05కు స్వామి వారి కల్యాణ మంటపంలో సదస్యను చేపట్టారు.



కేసీఆర్ సతీమణికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాజన్న సేవలో కేసీఆర్ సతీమణి..

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని మాజీ సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి మనుమడు హిమాన్షుతో (కేటీఆర్ తనయుడు) కలిసి వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పూల మొక్క లు అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయాధికారులు ప్రసాదాన్ని అందజేశారు.



బద్ది పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో క్యూలైన్‌లో భక్తులు

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

శ్రావణ మాస మంగళవారం సందర్భంగా వేములవాడ బద్ది పోచమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తి న బోనాలతో భక్తులు అమ్మవారి దర్శనం కోసం సుమారు 5 గంటలు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు భక్తులు వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ, ప్రిన్సిపాల్, మహిళ శిశు సంక్షేమ ఉద్యోగులు

సుల్తానాబాద్, ఆగస్టు 19: (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్‌కు బానిసలు కావద్దని ఎస్‌ఐ వేణుగోపాల్ అన్నారు. శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల్లో మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మద్యపానం, ధూమపానం అలవాట్లతో జీవితం దారి తప్పుతుందన్నారు. చదువుల్లో పోటీపడుతూ సన్మార్గంలో పయనించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని, సమాజంలో ఆదర్శంగా జీవించాలని వేణుగోపాల్ అన్నారు. విద్యార్థులందరితో నో డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ బాలసాని శ్రీనివాస్, నశాముక్త్ భారత్ జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, చైల్డ్‌లైన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోసమే బీజేపీ నిరసన


మాట్లాడుతున్న నాయకులు

కమాన్‌పూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసమే బీజేపీ నిరసన తెలుపుతోందని పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిలిచారన్నారు. మెజారిటీ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న విషయాన్ని బీజేపీ నాయకులు మరిచిపోయారన్నారు. తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, శ్రీపాదరావు విగ్రహం నుంచి పెంచికల్‌పేట డబుల్ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచారన్నారు. రాజాపూర్‌లోని మంగపేట బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. కమాన్‌పూర్ మండలాన్ని మూడు ముక్కలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న పుట్ట మధును అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. త్వరలోనే సెంట్రల్ లైటింగ్ పనులు మొదలు కానున్నాయని తెలిపారు. నాయకులు మల్యాల తిరుపతి, రాజ్‌కుమార్, గట్టయ్య, అబ్దుల్ రఫీక్, ఇక్బాల్, గడప కృష్ణమూర్తి, ముస్తాక్, కిషన్‌రెడ్డి, మల్యాల మహేష్, నవునూరి నర్సాగౌడ్, పాల్గొన్నారు.

ఈ నెల 22న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఈనెల 22న హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఆసక్తి గలవారు కలెక్టరేట్‌లోని రూంనెంబర్ 225లో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు తెలిపారు. ఇందులో 120 పోస్టులకు ఇంటర్వ్యూ ఉంటాయని, 40 ఫార్మసిస్ట్, 20 కస్టం సేల్స్ అసోసియేట్, 30 స్టాక్ పిక్కింగ్ అండ్ ప్యాకింగ్ అసిస్టెంట్, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఫార్మసిస్టు పోస్టులకు డిప్లొమా, డిగ్రీ ఇన్‌ఫార్మసీ, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణ ఉండాలని, 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో హాజరు కావాలని, 9392310323, 8985336947, 8121262441 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీనివాస్ కళ్లు సజీవం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బైరి శ్రీనివాస్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ కళ్లను దానం చేశారు. హైదరాబాద్ ఐ బ్యాంకుకు కళ్లలోని కార్నియాలను పంపినట్లు ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి బీష్మాచారి పేర్కొన్నారు. కళ్లు దానం చేసి ఇద్దరికి చూపు అందించి సహకరించిన మృతుడి కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడంతో నాంది చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

సుల్తానాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బపల్లి గ్రామంలో గుండెపోటుతో మరణించిన బాధిత కుటుంబానికి మంగళవారం తాల్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వారు యాభై కిలోల బియ్యాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ బియ్యం అందించారు. మాజీ సర్పంచ్ శ్రావణ్, రాజు, సుమన్, రామకృష్ణ పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికి ఎల్లవేళలా ముందుంటామని మనోజ్ అన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదినం

కమాన్‌పూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలను ముదిరాజ్ నాయకులు మంగళవారం నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివరాహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. నాయకులు నూనె రాజేశం, అనవేన సదయ్య, బర్ల సదానందం, మూల సరోజన, పిడుగు నర్సయ్య, బీమలింగు, కొలిపాక రాజయ్య, అనవేన లక్ష్మీరాజం పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాలు త్వరగా పూర్తి చేయాలి

ఎలిగేడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాలను లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇల్లులేని వారికి రాష్ట్ర ప్రభుత్వం 292 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసిందన్నారు. గృహాల నిర్మాణంలో పేద వర్గాలకు ఆర్థికభారం తగ్గించేందుకు మహిళా స్వశక్తి సంఘాల ద్వారా ప్రభుత్వం రూ.లక్ష రుణ సౌకర్యం కల్పించిందన్నారు. ఐకేపీ ఏపీఎం గీతను సంప్రదించాలని తెలిపారు. సబ్సిడీపై ఒక్కో ఇటుక రూ.6 చొప్పున అందిస్తున్నామని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జడ్పీ సీఈవో పర్యటన


మోడల్ ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న అధికారులు

ఎలిగేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన మోడల్ హౌస్ నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవ విషయంలో ఆలస్యం ఎందుకని జడ్పీ సీఈవో నరేందర్ అధికారులను ప్రశ్నించారు. మంగళ వారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన అధికారులతో సమావేశమయ్యారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీపై అధికారులను తెలుసుకున్నారు. మండలం లోని 12 గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వివరాలు, శాని టేషన్, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు చేశారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణ పురోగతి, గ్రామాల వారీగా వివరాలను అధికారులతో చర్చించారు. ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఈజీఎస్‌టీఏ రంజిత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంచితోపాటు సన్నబియ్యం

(5వ పేజీ తరువాయి)

మార్పుల వల్ల కొత్తగా చేరిన కుటుంబ సభ్యుల పేరిట కూడా బియ్యం ఇవ్వనున్నారు. ఆ మేరకు డైనమిక్ కీ రిజిష్టర్ రూపొందించారు. వాటి ఆధారంగా జిల్లాలో గల 413 రేషన్ డీలర్లకు బియ్యాన్ని కేటాయించారు. భారీ వర్షాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు మూడు మాసాలకు కలిపి జూన్‌లో ఒకేసారి సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. జూన్ నెలకు ముందే మూడు నెలల అలాట్‌మెంట్ పూర్తి కాగా, జూన్ నుంచి ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు పొందిన వారికి ఈ నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో 12,168 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులను జారీ చేయడంతో పాటు పాత కార్డుల్లో 30,260 మందిని చేర్చారు. వీరితో పాటు కొత్త కార్డులపై ఉన్న 32,362 మంది కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 62,622 మంది కుటుంబ సభ్యులకు ప్రయోజనం కలగనున్నది. అంతకు ముందు ఆహార భద్రత కార్డులు 2,11,141 కార్డులు ఉండగా, వీటిపై 6,32,753 మంది ఉన్నారు. అంత్యోదయ అన్న యోజన కార్డులు 12,257 ఉండగా, వీటిపై 33,993 మంది, అన్నపూర్ణ కార్డులు 155 ఉండగా, 166 మంది ఉన్నారు. మొత్తం 2,23,553 కార్డుల్లో కార్డుల్లో 6,66,912 మంది ఉన్నారు. మొత్తం 2,35,721 కార్డుల్లో 7,29,534 మంది రేషన్ కార్డుల ద్వారా లబ్ధి పొందనున్నారు. ప్రస్తుతం రేషన్ కార్డులపై కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డులను ఏరివేసేం దుకు 2015లో కొత్తగా దరఖాస్తులు తీసుకుని ఆహార భద్రత కార్డులను జారీ చేసింది. అంతేగాకుండా రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా చేసింది. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చింది. కానీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. 2019 నుంచి 2023 నవం బర్ వరకు అప్పటి ప్రభుత్వం ఒకసారి మాత్రమే 2021 అక్టోబర్‌లో కొందరికి రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఆ తర్వాత కార్డులు మంజూరు చేయలేదు. ఏడాది న్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించింది. ఆ మేరకు ప్రజాపాలనలో, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఎట్టకేలకూ ఏడాదిన్నర తర్వాత కొత్త రేషన్ కార్డులను జారీ చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' డీఎస్‌ఓ శ్రీనాథ్‌ను వివరణ కోరగా రేషన్ షాపుల ద్వారా వినియోగదా రులకు ప్రభుత్వం సరఫరా చేసిన సంచులను పంపిణీ చేయనున్నాం. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి కూడా వచ్చే నెల సరుకులు పంపిణీ చేయనున్నారు. 4403 టన్నుల బియ్యం కోటా పెరిగిందన్నారు.

ఐతరాజుపల్లిలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కరివేద సత్యనారాయణ రెడ్డి

సుల్తానాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతరాజుపల్లిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన జాగృతి విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకులు మడ్డి సాయికిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన ఆదర్శ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వారు శిబిరాన్ని నిర్వహించారు. రెండు వందల మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి సేవలను అందిస్తూ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఆదర్శ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. అనారోగ్య పరిస్థితుల్లో వైద్య శిబిరానికి రాని వారి ఇంటికి వెళ్లి చికిత్స అందించామన్నారు. జాగృతి రాష్ట్ర నాయకులు కండెం సురేష్, తోట హరీష్, బొగ్గుల సాయికృష్ణ, మున్నా, సునీల్, కుమార్, అమరేందర్ పాల్గొన్నారు.

ఖని ఆర్టీసీ డిపోలో సీపీఆర్‌పై శిక్షణ

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోలో సీపీఆర్‌పై శిక్షణ, బస్టాండ్ ఆవ రణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బస్టాండ్‌లో కార్మికులకు, సిబ్బందికి, ప్రయాణీకులకు వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేసి రోగ నిర్ధా రణ చేశారు. అనంతరం డిపోలో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణీ కులు, తోటి సిబ్బందికి ఎవరైన హార్ట్ ఎటాక్ గురైతే సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు వెల్ల డించారు. ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం, మెడి కవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్, యూసఫ్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

మంథని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో మంథని సింగిల్‌విండోలో రైతులకు అందుబాటులో 9 వందల బస్తాలు ఉన్నట్లు పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. యూరియా బస్తాలు అవసరం ఉన్న వారు తీసుకు వెళ్లవచ్చన్నారు. యూరియా కోసం వచ్చే రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. మంథని ప్రాంత రైతాంగానికి యూరియా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా మంత్రి యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు.

పాండవలొంకలో పర్యాటకుల సందడి


జలపాతం వద్ద పర్యాటకులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట సరిహద్దులోని రామగిరి కొండలను ఆనుకొని ఉన్న పాండవలొంకలో శ్రావణ మాస సందడి నెలకొంది. రామగిరి కొండల నుంచి వచ్చే వరద నీరు పాండవలొంక జలపాతంగా కొండపై నుంచి జాలువారుతుంటే పర్యాటకుల తరలివస్తున్నారు. శ్రావణమాసం సందర్భంగా వెన్నంపల్లి, కూనారం, జాఫర్ ఖాన్‌పేట నుంచి ప్రజలు వన భోజనాలకు వస్తారు. ఈ ప్రాంతంలో అంజనేయ స్వామి విగ్రహం, పాండవుల బొమ్మలు ఉన్నాయి. శ్రావణమాసంలో ముదిరాజ్ కులస్తులతోపాటు మంథని, మంచిర్యాల, చెన్నూరులాంటి దూర ప్రాంతాల నుంచి వారి ఆరాధ్యదైవమైన లక్ష్మీదేవరలను ఇక్కడకు తీసుకువచ్చి రెండు రోజులు ఉండి తిరుగు ప్రయాణమవుతారు. శ్రావణమాసం నాలుగు రోజుల్లో ముగియనుండగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు, పర్యాటకులతో కిక్కిరిసి పోయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోల్‌సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వరద నీరు వస్తున్నందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఈశ్వర ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల గేట్ల నుంచి నీటిని వదలడం, ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 6.0 లక్షల క్యూసె క్‌లకు పైగా నీళ్ళు దిగువకు వదిలే అవకాశం ఉన్నట్టు తెలిపారు. జాలర్లు, పశువుల కాపర్లు, రైతులు అప్రమత్తంగా ఉండాలని నదీ తీరంలోకి వెళ్ళవద్దని పేర్కొన్నారు.

ఆలయ చైర్మన్‌కు సన్మానం

ఓదెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్యను మంగళవారం మండల కేంద్రంలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. డైరెక్టర్లుగా నియమితులైన నాగపూరి రవిగౌడ్, తీర్థాల రాజారాంను సన్మానించారు. శాలివాహన సంఘం అధ్యక్షుడు ఇందుర్తి శ్రీనివాస్,దొమ్మటి స్వామి, కనుకయ్య, శ్రీనివాస్, ఇందుర్తి కుమార్, రాజమల్లు, పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పట్టణంలోని ఐడీయల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16న ఆదిలాబాద్ జిల్లా బోధన్ సమీపంలోని ఇందురాయపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థులు విజయ్‌సింగ్, నీతుకౌర్‌లు ప్రతిభను చాటారు. మంగళవారం పాఠశాల చైర్మన్ ముస్తాక్ అలీ, అకడమిక్ డైరెక్టర్ అఫ్సానా, ప్రిన్సిపాల్ కొండలరావు, స్కూల్ ఇన్‌చార్జి తబ్రేజ్‌ఖాన్ విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఓదెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పొత్కపల్లి ఎంపీపీఎస్ బాలికలలో ప్రీ ప్రైమరీ విద్య ప్రారంభమవుతుంది. ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు బి.సాంబయ్య కోరారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్, ఆయా పోస్టుకు ఏడవ తరగతి ఉండాలని తెలిపారు. 21 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

డాక్టరేట్ అందుకున్న రాజేందర్


గవర్నర్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకుంటున్న నగునూరి రాజేందర్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం గ్రామానికి చెందిన నగునూరి రాజేందర్‌కు డాక్టరేట్ లభించింది. మంగళవారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో యెన్ ఎఫెక్టివ్ అడాప్టివ్ గ్రాన్యులర్ స్టాటికల్ మెథడ్ అండ్ సెమాంటిక్ లినియర్ అల్జిబ్రాయిక్ బేస్డ్ డైమెన్షియాలిటీ రిడక్షన్ మెథడ్ ఫర్ డైమెన్షనల్ డేటా ఇమేజ్ అండ్ టెక్స్ డేటా అనే అంశంపై సీబీఐటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశాడు. ఈ పరిశోధనతో శాటిలైట్ ఇమేజెస్ వర్గీకరణ వార్తల డేటా వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. పదో తరగతి వరకు కూనారంలో చదివి ఇంటర్, బీటెక్ హనుమకొండలో పూర్తి చేశాడు. అనంతరం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

రైతులకు రాయితీపై పనిముట్లు

ఓదెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు పంపిణీ చేసేందుకు పనిముట్లు అందుబాటులో ఉన్నాయని ఏవో భాస్కర్ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, కేజీవీల్స్, పవర్ టిల్లర్లు, పవర్ విడర్లు, బాండ్ ఫార్మర్, సీడ్ కంపెనీ ఫెర్టిలైజర్ డ్రిల్, బ్రష్ కట్టర్‌తో పాటు పలు పనిముట్లను సన్న, చిన్న కారు రైతులు, అలాగే ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు 50 శాతం రాయితీపై అందజేస్తామని పేర్కొన్నారు. గతంలో లబ్ధిపొందని ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు ప్రాధాన్యం ఉంటుందని, ఈనెల 25 వరకు దరఖాస్తులను స్వీకరిం చనున్నట్లు తెలిపారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన వ్యవ సాయ యాంత్రీకరణ పథకం (ఎస్ఎంఏఎం) సన్న, చిన్నకారు, మహిళా రైతులకు 50శాతం సబ్సిడీతో వ్యవ సాయ యంత్రాలను అందజేయనున్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, దరఖాస్తుఫారం, పాస్‌ఫోటోతో వ్యవసాయ విస్తరణాధికారిని సంప్ర దించాలని, ట్రాక్టర్‌తో నడిచే పరికరాలు కావలసిన రైతు లు వారి పేరుమీద ఆర్సీ ఉండాలని ముత్తారం మండల వ్యవసాయ అధికారి సూచించారు.

సభ్యత్వ నమోదు సకాలంలో పూర్తి చేయాలి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న సంఘం నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్ష్యం మేరకు సభ్యత్వం చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి జిల్లా సభ్యత్వ నమోదును పర్యవేక్షించాలని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. రాజయ్య పటేల్ రామగుండం, అమిరిశెట్టి రామస్వామి పటేల్ మంథని, మచ్చకుర్తి చంద్రమౌళి పటేల్ పెద్దపల్లి నియోజకవర్గం బాధ్యులుగా సభ్యత్వ నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణ్ పటేల్, కార్యదర్శి వెంకన్న పటేల్ మాట్లాడుతూ వచ్చే నెల రాష్ట్ర కార్యవర్గం సమావేశంలోపు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని కోరారు. ఆకుల కిరణ్ పటేల్, బండారి రామూర్తి పటేల్, మీసాల సత్యనారాయణ, తూముల శ్రీనివాస్ పటేల్, వునుకొండ శ్రీధర్ పటేల్, జడల సురేందర్ పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన ఇండో-నేపాల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన అడ్డగుంటపల్లి కృష్ణవేణి స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డి.సాయిరోషన్ ప్రథమ బహుమతి సాధించారు. మంగళవారం ప్రిన్సిపాల్ శైలజ, కోచ్ చందు, ఉపాధ్యాయులు, పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు. రమేష్‌న గర్‌లోని ఉషోదయ హైస్కూల్‌కు చెందిన నాల్గవ తరగతి విద్యార్థి ఎండి రెహాన్ కరాటే పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. విద్యార్థిని కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ పసునూటి చందు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి

ముత్తారం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. బేగంపేట పీహెచ్‌సీ, సబ్‌సెంటర్‌లను సందర్శించారు. మంగళవారం ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా సెంటర్ల సిబ్బందితో మాట్లాడారు. టీబీ నివారణకు మందులు లభిస్తున్నాయని, వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించినట్లయితే వెంటనే నయం చేయవచ్చని గుర్తుచేశారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే ప్రతీ ఒక్కరు తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ మందులు ఉచితంగా లభిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. మెడికల్ ఆఫీసర్, హెచ్‌ఈవో, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలి

పాలకుర్తి,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలు నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, పంటలలో నీరు నిల్వకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో 12650 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారని, ఇందులో వరి 8720 ఎకరాల్లో, పత్తి 3227 ఎకరాల్లో ఆయిల్ పామ్ 180 ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. కన్నాల గ్రామ పరిసరాల్లో వరి,పత్తి పంటలను పరిశీలించారు.

డిష్, ఇంటర్నెట్ కేబుల్స్‌కు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి

కోల్‌సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధిలో కేబుల్ టీవీ, ఇంటర్నెట్ కనక్షన్ల కోసం విద్యుత్ పోల్స్‌ను వినియోగించుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని కరెంట్ పోల్స్‌కు అస్తవ్యస్థంగా డిష్, ఇంటర్నెట్ కేబుల్స్ కట్టిఉన్నాయని, వాటి వలన సిబ్బంది పనులు చేయడానికి ఇబ్బందికరంగా మారినట్టు తెలిపారు. తీగల కారణంగా గతంలో ప్రమాదాలు చోటుచేసుకున్నట్టు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తక్కువ ఎత్తులో కేబుల్స్ ఉండడంతో దేవుని రథయాత్రలు, శోభయాత్రలు, ఇతర శుభకార్యాల ఊరేగింపుల సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నట్టు ఆయన తెలిపారు. కేబుల్స్‌ను క్రమపద్ధతిలో అమర్చాలని సూచించారు. ప్రతి పోల్‌కు అనుమతులు తీసుకోవాలని, నెలవారి చార్జీలు చెల్లించాలని, అనుమతులు తీసుకోని కేబుల్స్ ఎటువంటి సమాచారం లేకుండా తొలగిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


ముత్తారం కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు, గోదావరిఖనిలో కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్ట్ 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం పట్టణ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ-2 ఎస్వోటూ జీఎం రాముడు ఫొటోగ్రఫి పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. కాలక్రమేణా ఫొటోగ్రఫీలో అనేక మార్పులు వచ్చాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని వినియోగదారు లకు నాణ్యమైన సేవలను అందించేలా నైపుణ్యతను పెంచుకోవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, నిమ్మల కుమార్, రాంపాష, శంకర్, శ్రీనివాస్, అనిల్, ఓదేలు, కుమారస్వామి, మోహన్, వెంకట్, శ్రావణ్, గుండా అశోక్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటోగ్రాఫర్లు కేక్ కట్ చేశారు. సీనియర్ ఫోటో గ్రాఫర్ గందం రాజేశ్, రహీం, రవిచంద్ర, రామక్రిష్ణ, సతీష్ ఫొటోగ్రఫీ దినోత్సవ విశిష్టతను వివరించారు. సన్నీ, రామక్రిష్ణ, బీట్ల రమేష్, శశివర్ధన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫొటోవీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలు ముత్తారం చౌరస్తాలో కేకు కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. వైద్య రాజేందర్, ప్రధాన కార్యదర్శి తిర్రి శ్రీనివాస్, దేశిని రాజు, గోస్కుల కుమారస్వామి, చారి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఫొటో వీడియోగ్రాఫర్లు బసంత్‌నగర్ అల్ట్రాటెక్ వర్కర్స్ క్లబ్‌లో ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలు గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ఫొటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంఘం కార్యాలయంలో జరిగాయి. మాజీ కార్పొరేటర్ పెద్దెల్లి ప్రకాష్ హాజరై కేక్‌కట్ చేసి మాట్లాడారు.అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధానకార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి ప్రసాద్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు శ్యాంసుందర్, సురేందర్, రోజారాణి, లావణ్య, శ్రీనివాస్, ఆరెల్లి శ్రీధర్, రామకృష్ణ, రమేష్, తిరుపతి, కుమారస్వామి, రమేష్, కుమారస్వామి, రమేష్, రాంబాబు, చంద్రకాంత్, పవన్ పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల రాంమూర్తి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. కొండ మల్లేశం, కనపర్తి సతీష్, అందె శ్రీరాజ్, కనపర్తి బాను, బద్రి, అట్ల సంతోష్, మల్లెత్తుల సంతోష్, ప్రసాద్,వినయ్, మనోజ్,సునిల్ పలువురు పాల్గొన్నారు.

రెస్క్యూ పోటీల నిర్వహణపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 54వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల నిర్వహణపై మంగళవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 10,11 తేదీల్లో ఆర్జీ-2 ఏరియాలో నిర్వహించనున్న పోటీలకు ఏర్పాట్లు చేయాలని జీఎం సూచించారు. పోటీలకు సింగరేణి వ్యాప్తంగా 8జట్లు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. రెస్క్యూ స్టేషన్ ఆవరణతోపాటు అండర్ గ్రౌండ్ పోటీలు, 7ఎల్ఈపీ గనిలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సేఫ్టీ జీఎం సూచించారు. ఆర్జీ-1, శ్రీరాంపూర్, భూపాలపల్లి జట్లు, ఆర్జీ-2,3, అడ్రియాల ఏరియాలు ఒక జట్టుగా, బెల్లంపల్లి మందమర్రి ఏరియాలు కలిపి ఒక జట్టు, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ఏరియాలు ఒక జట్టుగా పాల్గొంటాయని తెలిపారు. మొదటిసారి మహిళా జట్లు పోటీల్లో పాల్గొంటాయని, మహిళా ఉద్యోగినిలతో రెండు జట్లు బరిలో నిలుస్తాయన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నాగ్‌పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలకు పంపనున్నామని, జాతీయ పోటీలకు రెండు పురుషుల జట్లు, ఒక మహిళా జట్టు ఎంపిక చేయనున్నట్టు సేఫ్టీ జీఎం పేర్కొన్నారు. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఏఎల్పీ జీఎం నాగేశ్వరరావు, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు సృజన్‌మెహ్రా, నెహ్రూ, ఉదయ్‌హరిజన్, సంతోష్ కుమార్, ధనుంజయ, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, వేణుకుమార్ పాల్గొన్నారు.